క్లుప్తంగా

వీరాంజనేయుడికి విశేష పూజలు



రాపర్ల(పామర్రు): గ్రామంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో కార్తిక మాసం, పంచమి తిథిని పురస్కరించుకుని శనివారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామికి ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో అభిషేకం చేశారు. అనంతరం శత సహస్ర నామాలతో విశేష పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి స్వామికి నివేదనలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల ప్రభాకరరావు, సంధ్యాలక్ష్మి పాల్గొన్నారు.

5న హుండీ కానుకల లెక్కింపు

పమిడిముక్కల: మండలంలోని మంటాడ గ్రామంలో వేంచేసిన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల ఐదో తేదీన హుండీ కానుకలను లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.మాధవీలత శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో కానుకల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని సూచించారు.

అయ్యప్ప భక్తులకు చేయూత



తోట్లవల్లూరు: అయ్యప్ప భక్తుల శబరిమల యాత్రకు బీవీఆర్ యూత్ చేయూత అందించింది. మండలంలోని గరికపర్రు నుంచి ఈ నెల నాలుగో తేదీన 30 మంది అయ్యప్ప భక్తులు శబరిమల తరలి వెళ్లనున్నారు. వారికి వారం రోజులపాటు అల్పాహారం, భోజన సౌకర్యం నిమిత్తం బీవీఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి సహకారంతో బీవీఆర్ యూత్ అధ్యక్షుడు మరీదు జలధర శ్యామ్ రూ.35 వేల నగదును శనివారం అందజేశారు. బీవీఆర్ యూత్ కార్యదర్శి సుబ్బారెడ్డి, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలకుర్రులో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

పామర్రు: మండలంలోని ఎలకుర్రు గ్రామంలో కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య (కేడీబీ) ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. నిడుమోలు యూనియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. దివ్యాంగులైన చిన్నారులను ప్రతి ఒక్కరూ సహృదయంతో ఆదుకోవాలని కోరారు. కేడీబీ ట్రస్టు ద్వారా ఎంతో మంది దివ్యాంగులకు మెరుగైన సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పలు ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రస్టు నిర్వాహకుడు కాశీనాథుని నాగేశ్వరరావు, డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ప్రసన్నకుమారి, కేడీబీ డే కేర్ సెంటర్ ప్రిన్సిపాల్ డి.వసుంధర పాల్గొన్నారు.

కార్తిక వన భోజనాలు

పామర్రు: స్థానిక పుల్లేరు కాలువ గట్టున ఉన్న వెంకటాద్రి మఠంలో నూకల శాంతకుమారి, భాస్కరరావు సౌజన్యంతో శనివారం కార్తిక వన సమారాధన జరిగింది. తొలుత ఉసరి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప, భవానీ, ఆంజనేయ, శివ మాలధారులు, భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు.

90 మందికి వైద్య పరీక్షలు

పమిడిముక్కల: మండలంలోని మర్రివాడలో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ (ఉయ్యూరు) ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రవికుమార్, డాక్టర్ అనిత 90 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, నాగ సుబ్రహ్మణ్యం, కేసీసీ డెప్యూటీ మేనేజర్ అమర్‌నాథ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల వద్ద ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం



కొమరవోలు(పామర్రు): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని, ఎవరూ అధైర్య పడవద్దని ఉయ్యూరు ఆర్డీఓ దాసి రాజు సూచించారు. కొమరవోలు గ్రామంలోని ఆర్బీకే, సచివాలయం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ.. మండలంలోని 25 గ్రామాల నుంచి ఇప్పటి వరకు సుమారు 25 లారీల ధాన్యం లోడులను కొనుగోలు చేశామని తెలిపారు. ఎక్కడా సంచుల కొరత లేదన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా అధికారుల సమన్వయంతో కొనుగోళ్లు చేస్తున్నామని వివరించారు. పామర్రు తహసీల్దార్ వి.వి.భరత్‌రెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పొంచివున్న తుపాను గండం



తోట్లవల్లూరులో కోతలు పూర్తయ్యి పనలపై ఉన్న వరి పంట

అన్నదాతలను మిచాంగ్ తుపాను ఆందోళనకు గురి చేస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికందే సమయంలో తుపాను ముప్పు పొంచి ఉండటంతో రైతుల కంటి మీద కునుకు కరువైంది. ఆకాశం మేఘావృతమై, ఈదురు గాలులు వీస్తుండటంతో రైతులు పొలాల వెంట ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. వరికోత పూర్తి చేసిన రైతులు కట్టేతలు చేపట్టారు. యంత్రాలతో కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యాన్ని తరలించే పనుల్లో తలమునకలై ఉన్నారు.

– తోట్లవల్లూరు



ధాన్యం తడవకుండా కప్పిన పరదాలు



ధాన్యం బస్తాలను లారీలో లోడుచేస్తున్న కూలీలు



ధాన్యం ఆరబెడుతున్న రైతులు

విద్వేషాలను సృష్టిస్తే సహించేది లేదు

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పెదముత్తేవి(మొవ్వ): గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీ నాయకులు విభజించు, పాలించు విధానాన్ని అమలు చేస్తున్నారని, ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణిలో రాజకీయాలు చేస్తే సహించేది లేదని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హెచ్చరించారు. మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అసైన్డ్ భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పెదముత్తేవిలో 17 మంది రైతులకు 20 ఏళ్లకు పైబడి అసైన్డ్ చేసిన భూములను సెక్షన్ 22(ఏ) నిషేధిత జాబితా నుంచి తొలగించి, పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాలు అందిస్తున్నామని తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. నిడుమోలుకు చెందిన ఆరుగురు, అయ్యంకి చెందిన నలుగురు, అవురుపూడికి చెందిన ఇద్దరు, పెడసనగల్లుకు చెందిన తొమ్మిది మంది, చినముత్తేవికి చెందిన ఇద్దరు రైతులకు పట్టాలను అందజేశారు. తహసీల్దార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో చేసిన అరాచకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గమనించాలని సూచించారు. కల్లబొల్లి మాటలు, అబద్ధపు హామీలతో ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం చేసిన ఘనత టీడీపీది అని విమర్శించారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి, మరెన్నో ప్రజారంజక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత వైఎస్సార్ సీపీది అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఉప్పలపాటి జ్యోతి, కేడీసీసీ డైరెక్టర్ కాకర్ల శివకుమార్ (చిట్టిబాబు)లతో పాటు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనన్న పాలనను కోరుకుంటున్న ప్రజలు



అమలు చేసిన పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం స్థానిక 5వ వార్డు సచివాలయంలో శనివారం జరిగింది. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులోని 2,782 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా 8 కోట్ల 47 లక్షల 84 వేల 381 రూపాయలు, 899 మంది లబ్ధిదారులకు పరోక్షంగా 13 కోట్ల 20 లక్షల 94 వేల 343 రూపాయల మేర లబ్ధి చేకూరిందన్నారు. అందుకే జగనన్న పాలనను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మలిరెడ్డి రవి, నాయకులు వెంపల అప్పారావు, వార్డు కన్వీనర్ జోగా నాగేశ్వరరావు, కె.మహాలక్ష్మి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, అర్జా ప్రసాదు, దుడ్డు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి పీఎస్‌లో డీఎస్పీ తనిఖీలు



కూచిపూడిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

కూచిపూడి(మొవ్వ): త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మొవ్వ మండలంలోని ప్రతి గ్రామంలో జరిగే పరిణామాలపై ముందస్తు సమాచారం సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆదేశించారు. సాధారణ వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ శనివారం మొవ్వ మండలం కూచిపూడిలోని పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ తనిఖీల్లో స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరుతో పాటు పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని ముఖ్యమైన కేసులపై కూచిపూడి ఎస్ఐ డి.సందీప్, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



మండవల్లిలోని పోలింగ్‌బూత్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సర్పంచ్ ఝాన్సీ

మండవల్లి: స్థానిక 38, 39, 40, 41 పోలింగ్ బూత్‌లను మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ శనివారం పరిశీలించారు. మండవల్లిలో కొత్త ఓట్లు 188 నమోదు చేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు పోలింగ్ బూత్‌ల్లో చనిపోయిన వారు, ఓటు వేరేచోటికు మార్చుకున్న వారు మొత్తం 342 మంది ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బూత్‌లెవెల్ ఏజెంట్ మెండా సురేష్, బీఎల్వోలు కమల, శ్రీనివాస్, బి.నాగూరు, దినేష్ పాల్గొన్నారు.

మండవల్లి మండలంలో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లు, పుట్లచెరువు, పసలపూడి, చింతపాడు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఈటీపీఆర్డీ బి.ఆనందబాబు శనివారం పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే 6, 7, 8 ఫారాలను స్వీకరించి వారికి ఓటు నమోదు, వేరే ప్రాంతానికి మార్పిడి వంటి సేవలను అందజేయాలని బీఎల్వోలకు సూచించారు. బీఎల్వోలు పోలింగ్ స్టేషన్‌లలో పూర్తి స్థాయిలో హాజరైనట్లు ప్రకటించారు.

ఓటర్ల నమోదు డ్రైవ్‌లో 128 దరఖాస్తులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ వంశీ

కలిదిండి: మండలంలో 63 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలి రోజు 128 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ వంశీ తెలిపారు. ఓటర్ల నమోదుకు 56, తప్పుల సవరణకు 31, తొలిగింపుకు 41 దరఖాస్తులు అందాయన్నారు. ముసాయిదా జాబితాపై ఈ నెల 9 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ కె.బాజ్జి, బీఎల్వోలు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో ముదినేపల్లి మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ సూచించారు. తన కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ.. ఈ నెల ఐదో తేదీన తుపాను నెల్లూరు – మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందన్నారు. ఆ సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సార్వా వరి కోతలు ముమ్మరంగా జరుగుతోన్న నేపథ్యంలో పంటలు దెబ్బతినకుండా వ్యవసాయ సహాయకుల సూచనలు పాటించాలని కోరారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మండవల్లి: రైతులు తుపాను జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి పంటలో పంట గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరమే యంత్రంతో వరికోతలు పూర్తిచేసి ధాన్యం తడవకుండా కాపాడుకోవాలన్నారు. టార్పాలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తిస్థాయిలో అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. చేలల్లో ఉన్న వరి పనలను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కలిదిండి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.విద్యాసాగర్ శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. మండలంలో 15 వందల ఎకరాలు వరి సాగు చేయగా దాదాపు 1100 ఎకరాలు పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు తుపాను ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు టార్పాలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తిస్థాయిలో అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి పూర్ణిమ

గుడివాడ టౌన్: దివ్యాంగులు ఏదో ఒక కోణంలో నైపుణ్యం కలిగి ఉంటారని వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ విజయ్, రూరల్ ఎంపీపీ గద్దె పుష్పరాణి, టూ టౌన్ సీఐ తులసీధర్, భవిత కేంద్రం నిర్వాహకులు ఎంకే నీలాంబరం, ఎస్‌కే ఫెజిలా, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం స్థానిక కైకాల సత్యన్నారాయణ కళామందిరంలో జరిగింది. మెప్మా సీఎంఎం జి.ఎస్.సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలపై దివ్యాంగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీ సాయిరామ్ వికలాంగ సంఘానికి దివ్యాంగుల సంక్షేమం కోసం యూనియన్ బ్యాంకు నుంచి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మీ కుమారి, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

రేపు సంగీత విభావరి

పామర్రు: అమర గాయకుడు ఘంటసాల 101 జయంతి సందర్భంగా అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఈ నెల నాలుగో తేదీ ఉదయం గంటల నుంచి సంగీత విభావరి, ఘంటసాల-ఎన్టీఆర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఘంటసాల కళాపీఠం గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ శనివారం తెలిపారు. వివిధ రంగాల్లో ఎనిమిది మంది ప్రముఖులకు అవార్డులను అందజేస్తామని పేర్కొన్నారు. కళాపీఠం సభ్యులు అందరూ తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

21 గ్రామాల్లో ఓటరు నమోదు శిబిరాలు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలోని 21 గ్రామాల్లో ఉన్న 54 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఓటరు నమోదు శిబిరాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు ఆదివారం కూడా కొనసాగుతాయి. తొలి రోజు పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, సవరణలు నిర్వహించారు. మొవ్వ తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.గోపాలరావు, ఆర్ఐ ఈడే విజయలక్ష్మి, జేఏ శామ్యూల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటరు నమోదుపై ఆరాతీశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లంకపల్లి సుబ్రహ్మణ్యం, బూత్ కన్వీనర్లు కాటూరి శ్రీకాంత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండవల్లి హైస్కూల్‌ను సందర్శించిన సీఎంఓ

మండవల్లి: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు సీఎంఓ రవీంద్ర మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ద్వారా వచ్చిన ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. నాడు-నేడు ఫేజ్-1లో 26 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెలాఖరు నాటికి ఫేజ్-2లో మంజూరైన పాఠశాలలకు అందజేయనున్నట్టు తెలిపారు. ఎంఈఓ-2 ఎస్ రత్నసునాథం, సీఎంఓ రవీంద్ర కలిసి పాఠశాలలో భోజన వసతి, తాగునీటి సదుపాయం పరిశీలించారు.

రాయల్ క్లబ్ సర్వసభ్య సమావేశం



మండవల్లి: భైరవపట్నం శుభం ఫంక్షన్‌హాల్‌లో రాయల్‌క్లబ్ (కైకలూరు) సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. 2023–2024 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు రూ.65 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



గుడివాడ టౌన్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కె.నాగలక్ష్మి అన్నారు. స్థానిక అంకిత కార్యాలయంలో ఎయిడ్స్ వారోత్సవాల సందర్భంగా ఆమె అంకిత కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అంకిత కార్యకర్తలు ఎయిడ్స్ కంట్రోల్ చెయ్యడంలో చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని కొనియాడారు. అనంతరం అంకిత కార్యకర్తలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంకిత మేనేజర్ టి.అరుణ్‌కుమార్, పీడీ బేబీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన

కలిదిండి: ప్రతి ఒక్కరూ ఫిజియోథెరపీపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ పి.ప్రభాకర్‌రావు అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో శనివారం మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిమ్స్ హాస్పిటల్ ఫిజియోథెరపిస్ట్ రమేష్ బలహీనత, గ్యాస్, బ్యాక్ పెయిన్, స్పాండలైటిస్ ఆస్తమా, అతిగా సెల్ ఫోన్ ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

రైతుల్లో మిచాంగ్ కలవరం



పమిడిముక్కలలో హడావుడిగా కుప్పలు వేస్తున్న కూలీలు



పమిడిముక్కలలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

పమిడిముక్కల: రైతులను మిచాంగ్ తుపాన్ కలవరపెడుతోంది. తుపాను ప్రభావంతో ఆకాశం మేఘావృతమై, ఈదురు గాలులు వీస్తుండటంతో పంట చేతికి అందకుండా పోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. పమిడిముక్కల మండలంలో వరి పైరు కోతదశకు చేరింది. వరి కోతలు, కట్టేతలు, నూర్పిడులు ముమ్మరంగా సాగుతున్నాయి. యంత్రంతో నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టడం, కోత కోసిన పంటను కుప్పలు వేయడం, ధాన్యం బస్తాలను కొనుగోలు కేంద్రాలకు తరలించడం వంటి పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు నిమగ్నమయ్యారు.

పంట రక్షణ చర్యలు చేపట్టాలి

వర్షాలు కురవకముందే వరి పంటను రక్షించుకోవాలని ఏఓ గణేష్‌రెడ్డి సూచించారు. కల్లాల్లో ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి టార్పాలిన్‌లు కప్పుకోవాలని, వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోతలు పూర్తయిన పొలాల్లో పనలపై ఉన్న పంటను వెంటనే కుప్పలు వేసుకోవాలని పేర్కొన్నారు. తుపాను నేపథ్యంలో తన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. వీఆర్వోలను గ్రామాల్లో అందుబాటులో ఉంచామని, ఏవైనా ఇబ్బందులుంటే 99086 64623 సెల్ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ సంబంధిత ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఏఈ శ్రీనివాసరావు సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడిన, పోల్స్ పడిపోయినా సబ్‌స్టేషన్‌కు, లేదా తనకు లేదా 1912 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

బసవేశ్వరరావు సేవలు అభినందనీయం



బసవేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న వెంకట్రావ్ తదితరులు

పామర్రు: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు వినియోగదారుల హృదయాల్లో సుస్థిర స్థానం లభిస్తుందని యూనియన్ బ్యాంక్ మచిలీపట్నం ప్రాంతీయ మేనేజర్ కె.వెంకట్రావ్ అన్నారు. స్థానిక పామర్రు శాఖ యూనియన్ బ్యాంక్‌లో డెప్యూటీ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసిన వసుధ బసవేశ్వరరావు ఉద్యోగ విరమణ, సన్మాన సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథి వెంకట్రావ్ మాట్లాడుతూ.. వసుధ ఉద్యోగ నిర్వహణతో పాటు కవిత్వం, రచనలతో ఎంతో మంది ప్రశంసలు పొందారని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో బ్యాంకుకు సేవలు అందించారని అభినందించారు. అనంతరం బ్యాంక్ సిబ్బంది, మిత్రులు, కుటుంబ సభ్యులు వసుధ దంపతులను సన్మానించారు. బ్యాంక్ పామర్రు శాఖ మేనేజర్ జి.శేషగిరిరావు, బ్యాంక్ ఫీల్డు ఆఫీసర్ దిలీప్, స్థానిక ప్రముఖులు నందిపాటి పద్మారెడ్డి, మట్టా వీరాస్వామి, దామోదరరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.ఎం.ఎస్.ప్రసాద్, పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు ఎస్.త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్ భవన్నారాయణ

గుడివాడ టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. నందివాడ మండలం జనార్దనపురం, గుడివాడ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదును ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే సవరించిన ఓటర్ జాబితాలను ప్రతి పోలింగ్ బూత్‌లో ఉంచామన్నారు. శని, ఆది వారాల్లో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు అయినదీ లేనిదీ తెలుసుకుని మార్పులు, చేర్పులు గమనించి సరిచేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని బాధ్యతగా తీసుకుని ఓటరుగా చేరాలన్నారు. నందివాడ తహసీల్దార్ వి.భవన్నారాయణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు. గుడివాడలోని పలు పోలింగ్ కేంద్రాలలో పనితీరును మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పరిశీలించారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఫారం-6 వినియోగం, ఇతర అంశాలను పరిశీలించి, అప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న ఓటర్ల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టి.వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



వీరంకిలాకులో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కోపరేటివ్ అధికారి ఫణికుమార్

పమిడిముక్కల: వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోపరేటివ్ అధికారి, స్వీప్ నోడల్ ఆఫీసర్ వి.వి.ఫణికుమార్ గిరిజనులకు సూచించారు. మండల కేంద్రమైన వీరంకిలాకులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అత్యంత వెనుకబడిన గిరిజన తెగకు చెందిన (చెంచులు) గిరిజనులతో శనివారం సాయంత్రం ఓటు హక్కుపై అవగాహన సమావేశం నిర్వహించారు. గిరిజనులంతా ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. గిరిజనుల్లో చైతన్యాన్ని కల్పించి, ఓటు హక్కును వినియోగించుకొనేలా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి దూర్జటి తెలిపారు. డీటీ ఏసుపాదం, బీఎల్‌ఓలు పూజిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గుడివాడ డివిజన్

99516 02865 (గుడివాడ)

99516 02985 (కైకలూరు)

90105 77706 (పామర్రు)

Office mail : sakshiads@gmail.com